సాక్షి
అనంతపురం
బుధవారం, 27, సెప్టెంబర్, 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



టమాట కిలో రూ.8.50

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.8.50 పలికింది. కనిష్టం రూ.3, సరాసరిన రూ.6 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.2°/ 22.4°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్‌గా శివరామిరెడ్డి



ఉరవకొండ: ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి 2023–24 సంవత్సరానికి గాను శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. తనను చైర్మన్‌గా నియమించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ మోషేనురాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సభ్యుల గౌరవాధికారాలకు ఎవరు భంగం కలిగించినా, ప్రొటోకాల్ విషయంలో ఎటువంటి నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించినా విచారణ జరిపి చర్యలు తీసుకునేలా ప్రివిలేజ్ కమిటీ పని చేస్తుందన్నారు. చైర్మన్‌గా నియమితులైన వై.శివరామిరెడ్డికి ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

నెట్టికంటుడి హుండీ ఆదాయం రూ.64.27 లక్షలు



హుండీ నగదును లెక్కిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా రూ.64.27 లక్షల ఆదాయం లభించినట్లు ఈఓ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. భక్తులు స్వామివారికి హుండీ ద్వారా సమర్పించిన కానుకల లెక్కింపు మంగళవారం చేపట్టారు. 43 రోజులకు గానూ హుండీల ద్వారా రూ.64,27,361 నగదుతో పాటు అన్నదాన హుండీ ద్వారా రూ.21,844 అందిందన్నారు. అలాగే 0.01 గ్రాముల బంగారు, 2.58 కిలోల వెండిని కానుకల రూపంలో భక్తులు స్వామివారికి సమర్పించినట్లు తెలిపారు. ఆలయ అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆర్డీసీ సేవాసమితి సభ్యులు, బళ్లారికి చెందిన వీరభద్ర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

తహసీల్దార్లకు డిప్యుటేషన్



అనంతపురం అర్బన్: రెవెన్యూ శాఖలో పలువురు తహసీల్దార్లకు డిప్యుటేషన్ ద్వారా పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు కలెక్టర్ గౌతమి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐదుగురు తహసీల్దార్లకు డిప్యుటేషన్, ఒకరికి డైరెక్ట్ పోస్టింగ్, ఒకరికి పదోన్నతిపై పోస్టింగ్, ఒకరికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఇందులో రాయదుర్గం తహసీల్దార్ మారుతిని అనంతపురం అర్బన్‌కు, అనంతపురం నుంచి శ్రీధర్ మూర్తిని ఉరవకొండకు, తాడిపత్రి నుంచి మునివేలును రాప్తాడుకు డిప్యుటేషన్‌పై పంపారు. యాడికి తహసీల్దార్ అలెగ్జాండర్‌ను తాడిపత్రికి, బ్రహ్మసముద్రం తహసీల్దార్ బాలకిషన్‌ను రాయదుర్గానికి డిప్యుటేషన్ వేశారు. ఇక యాడికి డిప్యూటీ తహసీల్దార్ బాలమ్మను అక్కడే ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నియమించారు. బుక్కరాయసముద్రం డీటీగా ఉన్న ప్రతాప్‌రెడ్డికి గుంతకల్లు తహసీల్దార్‌గా పదోన్నతి కల్పించారు. డ్వామాలో పనిచేస్తున్న విజయలక్ష్మిని అనంతపురం రూరల్ తహసీల్దార్‌గా నియమించారు.

క్యాజువాలిటీలో కలవరం

- 'అత్యవసర' విభాగంపై 'మాఫియా' పంజా
- వైద్యుల విధుల్లో మితిమీరిన జోక్యం
- చెప్పినట్టు వినకపోతే బెదిరింపులు
- ఆత్మహత్యే శరణ్యమంటున్న వైద్యులు
- విధులకు ఆటంకం కల్గిస్తున్నారని ఎస్పీకి ఫిర్యాదు
- అనంతపురం సర్వజనాస్పత్రిలో గాడి తప్పిన పాలన



అనంతపురం సర్వజనాస్పత్రిలోని క్యాజువాలిటీ విభాగం

- ఇక్కడ పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. ఒత్తిడి తట్టుకోలేకపోతున్నాం. కొంతమంది బయటి వ్యక్తులు, మరికొందరు మీడియా పేరుతో బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. ఇదిలాగే కొనసాగితే ఆత్మహత్యే శరణ్యం.

  – నెల క్రితం సర్వజనాస్పత్రి క్యాజువాలిటీ డాక్టర్ జనార్దన్‌నాయక్ ఆవేదన

- మేము ఇక్కడ నిజాయితీగా పనిచేయాలని చూసినా చెయ్యనివ్వడం లేదు. తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అసలు బయటి వ్యక్తులకు క్యాజువాలిటీలో ఏం పని ఉంది? మేము వాళ్లు చెప్పిన పని చెయ్యలేదంటే మీడియాలో రాస్తాం అంటూ బెదిరిస్తున్నారు.

  – డాక్టర్ మాధురి ఆవేదన

'ఎన్నో ఏళ్లుగా ఇక్కడ పనిచేస్తున్నా. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదు. వాళ్ల మాట వినకుంటే నువ్వు ఇక్కడ ఎలా పనిచేస్తావో మేమూ చూస్తాం అంటూ బెదిరిస్తున్నారు. ఇలా ఉంటే మా ఉద్యోగం మేము చెయ్యలేకపోతున్నాం' అంటూ డాక్టర్ శౌరిస్ రెండునెలల క్రితం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తాజాగా డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం : అత్యవసర వైద్యం అందించే క్యాజువాలిటీ వార్డులో ఇతరుల పెత్తనం ఎక్కువైంది. వైద్యుల విధుల్లో జోక్యం మితిమీరిపోయింది. చావుబతుకుల మధ్య ఉన్న వారికి అత్యవసర చికిత్స చేసి ప్రాణాలు నిలిపే విభాగంలో బయటి వ్యక్తులు, ప్రైవేటు అంబులెన్సు డ్రైవర్లు, మీడియా పేరుతో కొందరు... ఇలా రకరకాల వ్యక్తుల ప్రమేయంతో అనంతపురం సర్వజనాస్పత్రిలో అనారోగ్యకర వాతావరణం నెలకొంది. ఒత్తిళ్లు, బెదిరింపులు తాళలేని డాక్టర్లు కొందరు మాకు ఆత్మహత్యే శరణ్యం అంటూ మొత్తుకుంటున్నా ఆస్పత్రి ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

ఎంఆర్ఐ, సీటీ స్కాన్‌ల కోసం బ్లాక్‌మెయిల్

కొంతమంది బయటి వ్యక్తులు క్యాజువాలిటీ వార్డుకు వచ్చి డాక్టర్లను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. ఔట్‌పోస్ట్ పోలీసులుగానీ, ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది గానీ ప్రశ్నించే సాహసం చేయడం లేదు. అత్యవసర రోగులకు కాకుండా ప్రైవేటు ఆస్పత్రి నుంచి వచ్చే రోగులకు సీటీ స్కాన్, ఎంఆర్ఐ చేసేందుకు సంతకం చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. అత్యవసర పరిస్థితిలో సీఎంఓ (క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్) సంతకం చేస్తే సీటీ స్కాన్, ఎంఆర్ఐ చేయొచ్చు. దీంతో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు సీఎంఓలను బెదిరించి సంతకాలు చేయించి అక్కడ ఎంఆర్ఐ, సీటీ స్కాన్‌లు చేయించుకుని పేషెంట్ల నుంచి డబ్బులు దండుకుంటున్నారు. 'మేము సంతకాలు చేయలేం' అంటే వెంటనే వాళ్ల మొబైల్ నంబర్లను వాట్సాప్ గ్రూప్‌లో చేర్చి దుష్ప్రచారం మొదలుపెడతారు. ఇలా ఆస్పత్రిలో ప్రతి ఒక్కరి నంబరూ గ్రూప్‌లో చేర్చడం విషప్రచారం చేయడం రివాజు. ఎన్నిసార్లు గ్రూప్ నుంచి ఎగ్జిట్ అయినా తిరిగి చేర్చడం, వారిపై అసభ్యకర పోస్టులు పెట్టడంతో డాక్టర్లు తీవ్ర మనోవేదన చెందుతున్నారు.

ప్రైవేట్ అంబులెన్సు 'మాఫియా'

సర్వజనాస్పత్రికొచ్చే కేసులను బయటి (ప్రైవేట్ ఆస్పత్రుల)కి తీసుకెళ్లేందుకు అంబులెన్సు డ్రైవర్లు 'మాఫియా'గా ఏర్పడ్డారు. విధిలేని పరిస్థితుల్లో పేషెంట్ వెళ్లి అడిగితే ప్రైవేటు అంబులెన్సు వారు ఓకే చెప్పవచ్చు. కానీ అక్కడికొచ్చే ప్రతి పేషెంటునూ ఎలాగోలా మభ్యపెట్టి బయటికి తీసుకెళ్లేందుకు ఈ డ్రైవర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇటీవలే వీరిని ప్రశ్నించినందుకు రఫీ అనే సెక్యూరిటీ గార్డుపై చేయి చేసుకున్నారు కూడా. ఇన్ని జరుగుతున్నా ఆస్పత్రి ఆవరణలోని ఔట్‌పోస్ట్ పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

డమ్మీగా మారిన సూపరింటెండెంట్

క్యాజువాలిటీతో పాటు వివిధ వార్డుల్లో జరుగుతున్న పరిణామాలు సూపరింటెండెంట్‌కు తెలిసినా ఎలాంటి చర్యలూ లేవు. ప్రతి రోగికీ నాణ్యమైన, మెరుగైన వైద్యం అందాలని సర్కారు చెబుతుంటే.. ఇక్కడ మాత్రం రోగులను ప్రైవేటు వ్యక్తులు తీసుకెళ్తున్నారు. అయినా సూపరింటెండెంట్ పట్టించుకున్న పాపాన పోలేదు. వైద్యులకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడంలోనూ ఘోరంగా విఫలమయ్యారు. అందుకే బయటి వ్యక్తులు ఇక్కడ మాఫియాలా తయారయ్యారని పలువురు వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తమను బ్లాక్‌మెయిల్ చేస్తున్న వారిని నియంత్రించాలని ఈ ఏడాది జూలై 7న సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేస్తున్న క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లు

రోగులతో టీడీపీ నాయకుల చెలగాటం

- మాజీ మంత్రి పరిటాల సునీత అడ్మిషన్‌తో హంగామా



టీడీపీ శ్రేణులతో నిండిపోయిన ఆస్పత్రి ప్రాంగణం

అనంతపురం మెడికల్: టీడీపీ నాయకుల హంగామా రోగులకు ఇబ్బంది కలిగించింది. అత్యవసర వైద్యం కోసం అంబులెన్సుల్లో తీసుకొచ్చిన రోగులను క్యాజువాలిటీలోకి తీసుకెళ్లేందుకు దారి లేకుండా అడ్డుగా నిల్చున్నారు. తెలుగుదేశం అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ అనంతపురంలో మాజీ మంత్రి పరిటాల సునీత చేపట్టిన ఆమరణ దీక్షను పోలీసులు భగ్నం చేశారు. అనంతరం ఆమెను చికిత్స నిమిత్తం సర్వజనాస్పత్రి క్యాజువాలిటీలో చేర్చారు. ఇదే క్రమంలో మాజీ మంత్రులు కాలవ శ్రీనివాసులు, పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి, టీడీపీ నేత పరిటాల శ్రీరామ్‌తో పాటు కార్యకర్తలు ఆస్పత్రిలోకి చొరబడ్డారు. కార్లు, ద్విచక్ర వాహనాలను ఇష్టారాజ్యంగా పార్క్ చేశారు. దీంతో 108 అంబులెన్స్‌లు లోపలికి వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. అంబులెన్స్‌లో వచ్చిన రోగులను అతికష్టం మీద క్యాజువాలిటీకి తరలించారు. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు టీడీపీ కార్యకర్తలు ఆస్పత్రి ఆవరణలో నినాదాలు చేస్తూ భయానక వాతావరణం సృష్టించారు. చివరకు మాజీ మంత్రి పరిటాల సునీత డిశ్చార్జ్ అయ్యాక వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యం



'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

- ముంగిటకే వైద్య సేవలు
- ఆరోగ్యశ్రీ కింద మరిన్ని చికిత్సలు
- 'ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో కలెక్టర్ గౌతమి

అనంతపురం రూరల్: ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ గౌతమి అన్నారు. అందులో భాగంగానే ప్రజలకు వైద్యసేవలను చేరువ చేస్తోందన్నారు. మంగళవారం అనంతపురం రూరల్ మండలం ఏ నారాయణపురం పంచాయతీలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి ఇంటికీ వైద్య సిబ్బంది వెళ్లి వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుంటూ సేవలందించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలతో పాటు వార్డుల్లో సైతం వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి వైద్య సిబ్బందిని నియమించి వైద్య సేవలందిస్తున్నట్లు వివరించారు. ఆరోగ్యశ్రీ పథకంలో మరిన్ని చికిత్సలను చేర్చి ఉచితంగా వైద్యమందిస్తున్నట్లు తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా ఇంటి వద్దకే డాక్టర్లు వెళ్లి వైద్య సేవలందిస్తున్నట్లు చెప్పారు. సచివాలయ, వైద్య సిబ్బంది సమన్వయంతో ప్రజల ఇంటి వద్దకే వెళ్లి ప్రభుత్వం అందించే పథకాలపై అవగాహన కల్పించి అర్హత కల్గిన కుటుంబాలకు లబ్ధి చేకూరేవిధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వైద్యంతో పాటు విద్యా రంగానికి కూడా ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ఆడ పిల్లలనూ ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ బి.దేవి, ఆర్డీఓ మధుసూదన్, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, డాక్టర్లు భాస్కర్‌నాయుడు, అచ్యుతప్రసాద్, మనోజ్, ఎంపీటీసీ సంధ్య, బళ్లారి నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు కణేకల్లులో 'జగనన్నకు చెబుదాం'

అనంతపురం అర్బన్: మండల స్థాయి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని బుధవారం కణేకల్లులో నిర్వహించనున్నట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. కేసీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో ఉదయం 10 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం', 'స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

40 శాతం రాయితీతో విత్తన పప్పుశనగ



అనంతపురం అగ్రికల్చర్: రబీ సాగుకు సంబంధించి 40 శాతం రాయితీతో రైతులకు విత్తన పప్పుశనగ పంపిణీ చేసేందుకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నల్లరేగడి భూములు కలిగిన ప్రాంతాల రైతులు ఆర్‌బీకేల్లో విత్తనం కోసం రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. జిల్లాకు 27,266 క్వింటాళ్ల విత్తన పప్పుశనగ కేటాయించారన్నారు. క్వింటాలు ధర రూ.8,100 కాగా.. అందులో 40 శాతం రాయితీ రూ.3,240 పోనూ రైతులు తమ వాటా కింద రూ.4,860 ప్రకారం చెల్లించాలని సూచించారు. బుధవారం నుంచి ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్లు మొదలవుతాయన్నారు.

పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు





ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన, బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం రూరల్: పర్యాటక రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. నగర శివారులోని శిల్పారామంలో మంగళవారం ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా కలెక్టర్ గౌతమి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ హాజరై మాట్లాడారు. జిల్లాలో ఎన్నో పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, దేశ, విదేశాల నుంచి పర్యాటకులు వస్తున్నారని తెలిపారు. పర్యాటక ప్రదేశాల అభివృద్ధితో జిల్లా ఖ్యాతి ఎల్లలు దాటుతుందన్నారు. పర్యాటక రంగ అభివృద్ధితో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, రాజీవ్‌కాలనీ సర్పంచ్ ఆశాబీ, ఎంపీటీసీ సభ్యురాలు సంధ్య, శిల్పారామం ఏఓ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

28న అండర్–14 టెన్నిస్ బాల్ క్రికెట్ జట్ల ఎంపికలు

అనంతపురం: ఈ నెల 28న అండర్ – 14 బాల, బాలికల టెన్నిస్ బాల్ క్రికెట్ జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చందన షైక్ అన్వర్ బాషా తెలిపారు. నగరంలోని నీలం సంజీవరెడ్డి మైదానంలో గురువారం ఉదయం 9 గంటలకు నిర్వహించే ఎంపికలకు క్రీడాకారులు ఆధార్ కార్డుతో హాజరుకావాలన్నారు. రూ.200 ప్రవేశ రుసుం ఉంటుందని తెలిపారు. ఎంపికైన వారు గుంటూరు జిల్లాలో అక్టోబరు 16, 17 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 6309430837, 6309715324 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అనంతలో ఫుట్‌బాల్ సందడి

- సబ్ జూనియర్ బాలుర జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం
- తొలిరోజు విజేతలు త్రిపుర, అసోం
- ఏపీ–సిక్కిం, తమిళనాడు– బిహార్ మ్యాచ్‌లు డ్రా

అనంతపురం: అనంతపురంలో ఫుట్‌బాల్ సందడి మొదలైంది. 15 రోజుల ఫుట్‌బాల్ క్రీడా పండుగకు ఆర్డీటీ క్రీడా గ్రామం వేదికైంది. సబ్ జూనియర్ బాలికల జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్–2023 పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 20 రాష్ట్రాల జట్ల క్రీడాకారులు తరలివచ్చారు. ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, కలెక్టర్ ఎం.గౌతమి, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని, పోటీలను ప్రారంభించారు. తొలిరోజు పోటీల్లో త్రిపుర, అసోం జట్లు గెలిచి శుభారంభం చేశాయి. ఏపీ–సిక్కిం, తమిళనాడు–బిహార్ జట్ల మధ్య మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. విద్యార్థులు, క్రీడాభిమానులు హాజరై ఫుట్‌బాల్ పోటీలను తిలకించారు.

మ్యాచ్‌ల వివరాలు..

- ఆంధ్రప్రదేశ్, సిక్కిం జట్ల మధ్య జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్ 1–1 గోల్‌తో డ్రాగా ముగిసింది. ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున సాత్విక్ గోల్ సాధించాడు.
- అండమాన్ నికోబార్ దీవుల జట్టుపై త్రిపుర జట్టు మూడు గోల్‌లు చేసి విజయం సాధించింది.
- హిమాచల్‌ప్రదేశ్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ఏడు పాయింట్లతో అసోం జట్టు సాధించింది. హిమాచల్‌ప్రదేశ్ ఒక్క గోల్ కూడా సాధించలేక చతికిలపడింది.
- తమిళనాడు, బిహార్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 1–1 గోల్‌తో డ్రా అయ్యింది.



ఆంధ్రప్రదేశ్‌- సిక్కిం జట్ల మధ్య మ్యాచ్



ఫుట్‌బాల్ పోటీలో తలపడిన త్రిపుర, అండమాన్ క్రీడాకారులు





ఫుట్‌బాల్ మ్యాచ్‌ను వీక్షిస్తున్న ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోటగిరి శ్రీధర్, కలెక్టర్ గౌతమి, ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, విద్యార్థులు

కొనసాగుతున్న వర్షాలు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కొనసాగుతున్నాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు 21 మండలాల పరిధిలో 10.6 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. నార్పల 65.2 మి.మీ, యల్లనూరు 48.8, తాడిపత్రి 32.4, శింగనమల 21.8, బుక్కరాయసముద్రం 21.4, గార్లదిన్నె 17.2, పుట్లూరు 17, విడపనకల్లు 13.2, పెద్దవడుగూరు 11.2 మి.మీ నమోదు కాగా.. మిగతా మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. సెప్టెంబర్ సాధారణ వర్షపాతం 110.9 మి.మీ కాగా ఇప్పటి వరకు 90.6 మి.మీ నమోదైంది. మొత్తం మీద ఈ సీజన్‌లో 296.7 మి.మీ గానూ 24 శాతం తక్కువగా అంటే 223.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

మరో ఐదు రోజులు వర్ష సూచన

బుక్కరాయసముద్రం: జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో చిరు జల్లుల నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అశోక్ కుమార్ మంగళవారం తెలిపారు.

డీఐజీని కలిసిన ఎస్పీ


డీఐజీ అమ్మిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: డీఐజీ అమ్మిరెడ్డిని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల బందోబస్తు పర్యవేక్షణలో ఉన్న డీఐజీ విధులు ముగించుకుని మంగళవారం తిరిగి విధుల్లోకి చేరారు. దీంతో స్థానిక రేంజ్ కార్యాలయంలో డీఐజీని ఎస్పీ కలసి పుష్పగుచ్ఛం అందజేసి, మాట్లాడారు. జిల్లాలో శాంతి భద్రతల పర్యవేక్షణలో రాజీ పడకుండా పనిచేయాలని ఈ సందర్భంగా ఇద్దరు అధికారులు చర్చించుకున్నారు.

'జయ'కేతనం

- రాష్ట్రపతి అవార్డుకు ఎంపికైన జయమారుతి


అనంతపురంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారికి చుక్కల మందు వేస్తున్న జయమారుతి (ఫైల్)

అనంతపురం/కల్చరల్: ఉండేందుకు సక్రమమైన ఇల్లు కూడా లేదు.. వ్యవసాయ కూలి పనులు తప్ప మరో జీవనాధారమూ లేదు. అయినా వెనుకంజ వేయలేదు. చదువు ఒక్కటే తన పేదరికాన్ని దూరం చేస్తుందని నమ్మిన ఆ యువకుడు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ముందుకు సాగాడు. కష్టాలెన్ని ఎదురైనా ఆత్మస్థైర్యంతో ఎదుర్కొన్నాడు. ఎన్నో స్ఫూర్తిదాయకమైన సేవా కార్యక్రమాలతో అందరినీమెప్పిస్తూ ఏకంగా రాష్ట్రపతి అవార్డుకు ఎంపికయ్యాడు. మొక్కవోని దీక్షతో శ్రమించి అనంత ఖ్యాతిని రెపరెపలాడిస్తూ జాతీయ సేవా పథకం (ఎస్ఎస్ఎస్)లో దేశంలోనే ప్రథమ స్థానం దక్కించుకున్న జయమారుతి విజయ ప్రస్థానమిది.

పేదరికాన్ని జయిస్తూ

బ్రహ్మసముద్రం మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన కురుబ నీలకంఠప్ప, అనసూయమ్మ దంపతులు వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. వీరి కుమారుడు జయమారుతి.. చిన్నప్పటి నుంచి చదువుకోవాలన్న ఆసక్తిని కనబరుస్తుండడంతో గ్రామంలోనే ప్రాథమిక విద్యను పూర్తి చేయించారు. అనంతరం కళ్యాణదుర్గంలో ఇంటర్, అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ, ఎస్కేయూలో పీజీ పూర్తి చేశారు. డిగ్రీ చదువుతున్నప్పుడే 2017 నుంచి 2022 వరకు ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా వివిధ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వచ్చారు. ఈ క్రమంలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలందించే పథకాలపై నిరుపేదలను చైతన్యపరిచారు. ఓటరు బాధ్యతలు, యోగా అవగాహన ర్యాలీలు చేపట్టి అందరినీ మెప్పించారు. ఫలితంగా 2019-2020లో రాష్ట్రస్థాయి ఎన్ఎస్ఎస్ ఉత్తమ వలంటీర్‌గా నెహ్రూ యువకేంద్రం ద్వారా యంగ్ అచీవర్ అవార్డును కైవసం చేసుకున్నారు. ఈ క్రమంలోనే 2021-2022 సంవత్సరానికి గాను దేశ వ్యాప్తంగా 30 మంది వలంటీర్లను రాష్ట్రపతి పురస్కారానికి ఎంపిక చేయగా, వీరిలో మొదటి స్థానంలో జయమారుతి ఉండడం గమనార్హం. ఈ నెల 29న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డునందుకోనున్నారు.

ఊరిని బాగుపరుస్తాననే నమ్మకముంది



మా సీనియర్ బిసాతి భరత్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ఆచార్య మురళీధర్‌రావు సార్, రమేష్ అన్న నన్నెంతగానో ప్రోత్సహిస్తూ వచ్చారు. యువత తలుచుకుంటే ఏదైనా సాధించవచ్చునని ఎన్ఎస్ఎస్ ద్వారా తెలుసుకున్నా. రాష్ట్రపతి అవార్డు నాపై మరింత బాధ్యత పెంచింది. ఈ స్ఫూర్తితో కనీసం బస్సు సౌకర్యం సరిగా లేని మా ఊరిని బాగుపరుస్తానన్న నమ్మకం నాకుంది.

– జయమారుతి, జాతీయ అవార్డుగ్రహీత

ముళ్లకంపపై నిద్రించిన పూజారి


ముళ్ల కంపలపై నిద్రిస్తున్న చంద్రానాయక్

బెళుగుప్ప: మండలంలోని బెళుగుప్ప తండాలో మంగళవారం జరిగిన గౌరసంద్రం మారెమ్మ జాతరలో భారీగా పేర్చిన ముళ్లకంపలపై ఆలయ పూజారి చంద్రానాయక్ నడుచుకుంటూ వెళ్లి నిద్రించాడు. జాతరలో భాగంగా ఉదయం అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఆచారంలో భాగంగా ముళ్లకంపలపై పూజారి నిద్రించే కార్యక్రమం కొనసాగింది. ఈ వింత సంప్రదాయాన్ని చూసేందుకు ఉరవకొండ, బెళుగుప్ప, కళ్యాణదుర్గం ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు ఆలయం వద్దకు చేరుకోవడంతో ఆ పరిసర ప్రాంతాలు కిక్కిరిసాయి.

టైలరింగ్, మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ

అనంతపురం: ఉమెన్స్ టైలరింగ్, జర్దోసి మగ్గం వర్క్‌పై ఎస్కేయూనివర్సిటీ సమీపంలోని రూడ్‌సెట్‌లో మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు రూడ్‌సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అక్టోబర్ 11వ తేదీ నుంచి నెల రోజుల పాటు కొనసాగే శిక్షణకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన గ్రామీణ నిరుద్యోగ మహిళలు అర్హులు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తారు. పూర్తి వివరాలకు 83099 15577, 96188 76060లో సంప్రదించవచ్చు.

పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలి

- ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోని


మాట్లాడుతున్న జోనల్ మేనేజర్ సోని

అనంతపురం టౌన్: పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని యువ పారిశ్రామిక వేత్తలకు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోని పిలుపునిచ్చారు. మంగళవారం పరిశ్రమల శాఖ కార్యాలయంలో యువ పారిశ్రామిక వేత్తలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకంగా ఇండస్ట్రియల్ పార్క్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో వందల ఎకరాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. పుట్టపర్తి మండలం కప్పలబండ, హిందూపురం పరిగి, మడకశిర నియోజకవర్గంలోని ఆర్ అనంతపురం, రాప్తాడు మండలంలోని గొందిరెడ్డిపల్లిలో ఇండస్ట్రియల్ పార్క్‌లను ఏర్పాటు చేసి పారిశ్రామిక వేత్తలకు ప్రత్యేక రాయితీలతో స్థలాలను కేటాయిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమల స్థాపన కోసం ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలతోపాటు ప్రోత్సాహాలను అందిస్తోందన్నారు. రాయితీలను సద్వినియోగం చేసుకొని పరిశ్రమలను స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నారు. పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజారావు, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ నాగార్జున, ఎల్‌డీఎం సత్యరాజు, ఏడీ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏపీఐఐసీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

ఆంధ్ర ప్రదేశ్ పారిశ్రామిక మౌలిక కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఐఐసీ) స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఆ సంస్థ కార్యాలయంలో గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోని మాట్లాడుతూ... కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఈ 50 ఏళ్లలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 105భారీ పరిశ్రమలతో ప్రత్యక్షంగా 59వేల మంది ఉపాధి పొందుతున్నారు. వీటితోపాటు 10వేలకు పైగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో మరో 98 వేల మంది ఉపాధి పొందుతున్నారన్నారు. రానున్న రోజుల్లో జిల్లా పారిశ్రామికంగా మరింతగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. అందుకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం సైతం పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించి భారీగా రాయితీలను అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ఏడీ రాజశేఖర్‌రెడ్డి, డిప్యూటీ జోనల్ మేనేజర్ నాగార్జున, అహుడా సెక్రెటరీ చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

దసరా సెలవుల్లో రద్దీకనుగుణంగా బస్సులు

- ప్రజారవాణా అధికారి సుమంత్.ఆర్.ఆదోని

అనంతపురం సెంట్రల్: దసరా పండుగ సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లే సుదూర ప్రాంత ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడపాలని సిబ్బందిని జిల్లా ప్రజారవాణా అధికారి సుమంత్.ఆర్.ఆదోని ఆదేశించారు. ప్రత్యేక బస్సు సర్వీసుల నిర్వహణపై మంగళవారం ఆయన తన చాంబర్‌లో జిల్లాలోని అన్ని డిపో మేనేజర్లతో సమీక్షించారు. ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణం అందించడంతో పాటు సంస్థకు ఆదాయం తీసుకురావడంపై దృష్టి సారించాలన్నారు. ప్రతి బస్సు కండీషన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సమయవేళలు మార్చాలన్నారు. కార్గోలో స్వీకరించిన వస్తువులను వెంటనే డెలివరీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల నివారణకు అన్ని డిపోలలో డ్రైవర్లకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. కేఎంపీఎల్ పెంచాలని, బ్రేక్‌డౌన్ తగ్గించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ సీటీఎం రమేష్‌బాబు, డిప్యూటీ సీఎం మోహన్‌కుమార్, డిపోమేనేజర్లు నాగభూపాల్, శంకర్, రామచంద్ర, సురేష్‌కుమార్, నారాయణస్వామి, ట్రాఫిక్ ఇన్‌చార్జులు వినయ్‌కుమార్, రమణమ్మ, పీవీ ప్రసాద్, ఎస్‌టీఐ నాగార్జున, ఏఎంఎఫ్ సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

కళ్యాణదుర్గం : కన్వీనర్ కోటా కింద బోరంపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం సివిల్, ఎలక్ట్రానిక్స్, ఎఐఎం బ్రాంచ్‌ల్లో స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీధర్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు. ఆసక్తి ఉన్న వారు అక్టోబర్ 3వ తేదీ లోపు బయోడేటా ఫారం, కుల ధ్రువీకరణ పత్రం జిరాక్స్ ప్రతులను అందజేయాలి. స్పాట్ అడ్మిషన్ కింద చేరే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వర్తించవు.

ఎలక్ట్రీషియన్, ల్యాండ్ సర్వే కోర్సుల్లో ఉచిత శిక్షణ

అనంతపురం: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ), ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో అనంతపురం, గుంతకల్లులోని స్కిల్ హబ్ సెంటర్ల వేదికగా నిరుద్యోగ యువతకు ల్యాండ్ సర్వేయింగ్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు మంగళవారం తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల వయసు కలిగి పదో తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన నిరుద్యోగ యువతకు ప్లంబింగ్ అండ్ శానిటేషన్‌లో పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి ఎలక్ట్రీషియన్‌లో, ఇంటర్ ఉత్తీర్ణులైన వారికి ల్యాండ్ సర్వేయింగ్‌లో మూడు నెలలు పాటు శిక్షణ ఉంటుంది. అనంతరం సర్టిఫికెట్ అందజేస్తూ ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 28వ తేదీ లోపు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్, అర్హత ధ్రువపత్రాలు, ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు 99086 20306, 90323 45188లో సంప్రదించవచ్చు.

తాడిపత్రిలో చైన్‌స్నాచింగ్


బాధితురాలు కృష్ణవేణి

తాడిపత్రి: స్థానిక రూరల్ పరిధిలోని గన్నెవారిపల్లి కాలనీలో నివాసముంటున్న కృష్ణవేణి మెడలోని బంగారు గొలుసును దుండగులు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... మంగళవారం తెల్లవారుజామున తన ఇంటి వద్ద ఉన్న పశువుల పాక వద్ద చెత్తను కృష్ణవేణి శుభ్రం చేస్తుండగా ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై అక్కడకు చేరుకున్నారు. వీరిలో ఒకరు కిందకు దిగి కృష్ణవేణి మెడలోని 3 తులాల బంగారు గొలుసును లాక్కొని ద్విచక్ర వాహనంపై ఉడాయించాడు. మంకీక్యాప్ ధరించడం వల్ల వారు ఎవరైంది తెలియకుండా పోయింది. కృష్ణవేణి కేకలతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకునే లోపు దుండగులు కంటికి కనిపించకుండా పోయారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు తాడిపత్రి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటన జరిగిన ప్రదేశంలోని ఓ ఇంటి వద్ద ఉన్న సీసీకెమెరాల పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

మొబైల్ షాపు దగ్ధం


మంటల్లో కాలిపోతున్న దుకాణం

రాయదుర్గంటౌన్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఓ మొబైల్ షాప్ కాలి బూడిదైంది. వివరాలు... షార్ట్‌సర్క్యూట్‌తో ఓ మొబైల్ షాపు పూర్తిగా అగ్నికి ఆహుతై దాదాపు రూ.8 లక్షల దాకా నష్టం వాటిల్లిన ఘటన రాయదుర్గం పట్టణంలోని మదీనా కాంప్లెక్స్‌లో మంగళవారం తెల్లవారుజామున 5 గంటలకు జరిగింది. రాయదుర్గానికి చెందిన మునీర్ అహమ్మద్ 13 ఏళ్లుగా స్థానిక మదీనా కాంప్లెక్స్‌లో మునీర్ మొబైల్స్ పేరుతో దుకాణం నిర్వహిస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజాము 5 గంటలకు దుకాణం నుంచి భారీగా పొగలు వస్తుండడంతో స్థానికుల నుంచి సమాచారం అందుకున్న మునీర్ అక్కడకు చేరుకుని షట్టర్ ఎత్తాడు. అప్పటికే ఎగిసి పడుతున్న మంటలను ఆర్పడం స్థానికులకు సాధ్యపడలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసింది. మొబైల్ విడిభాగాలు, మిషనరీ, రిపేరికి వచ్చిన ఫోన్లతో పాటు విక్రయానికి ఉంచిన కొత్త ఫోన్లు, ఫర్నీచర్ కాలి బూడిదైనట్లు యజమాని మునీర్ తెలిపారు. ఘటనతో దాదాపు రూ.8 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు వాపోయాడు.

జీడీఎస్ ఉద్యోగుల సమ్మె పిలుపు

అనంతపురం సిటీ: ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ పిలుపు మేరకు అక్టోబర్ 4న ఒక రోజు సమ్మె నిర్వహించతలపెట్టినట్లు ఆ యూనియన్ అనంతపురం డివిజన్ సెక్రటరీ కృష్ణయ్య తెలిపారు. ఈ అంశంపై మంగళవారం నిర్వహించిన యూనియన్ అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. 4వ తేదీన బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లు(బీపీఎం) విధులు బహిష్కరించి, సమ్మెకు మద్దతు తెలపాలన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

గుత్తి: అంతర్ జిల్లా దొంగను పోలీసులు అరెస్ట్ చేసి ఐదు తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను మంగళవారం సీఐ వెంకట్రామిరెడ్డి వెల్లడించారు. జల్సాలకు అలవాటు పడిన కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రాంపల్లి గ్రామానికి చెందిన అగ్రహారం రంగస్వామి తన అవసరాలు తీర్చుకునేందుకు పట్టపగలే దొంగతనాలకు పాల్పడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 15న గుత్తి మండలం గాజులపల్లిలో తాళం వేసిన నాగాంజినేయులు ఇంట్లోకి చొరబడి ఐదు తులాల బంగారు నగలు అపహరించుకెళ్లాడు. ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు పక్కా ఆధారాలతో మంగళవారం తురకపల్లి క్రాస్ వద్ద రంగస్వామిని అరెస్ట్, ఐదు తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవాలి

- కలెక్టర్ గౌతమి


గర్భిణులకు సీమంతం చేస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం సెంట్రల్: ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని గర్భిణులకు కలెక్టర్ గౌతమి పిలుపునిచ్చారు. అనంతపురంలోని రెవెన్యూభవన్‌లో ఐసీడీఎస్, సాయి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సామూహిక సీమంతాల కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ఆరోగ్యంగా ఉంటే ఇల్లు కూడా ఆనందంగా ఉంటుందన్నారు. ఈ ఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవంగా ప్రకటించడం జరిగిందని, ఈ క్రమంలో చిరుధాన్యాల సాగుకు అనుకూలమైన జిల్లాలో ఆ దిశగా రైతులను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోషకాహారం, దాని ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సిబ్బందిని కోరారు. బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి తల్లులతో మాట్లాడాలి బాల్య వివాహాల అడ్డుకట్టకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం 26 మంది గర్భిణులకు సీమంతం చేశారు. రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం నుంచి తీసుకొచ్చిన పోషకాహారం న్యూట్రిషన్ ప్లాంట్స్‌ను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. చిరుధాన్యాల వంటలతో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో నిర్వాహకులు విజయసాయి, ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి, సోషల్ వెల్ఫేర్ జేడీ మధుసూదన్‌రావు, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారి, డీటీడబ్ల్యూ అన్నాదొర, మెప్మా పీడీ విజయలక్ష్మి, వ్యవసాయశాఖ ఏడీఏ శైలజ, కేవీకే శాస్త్రవేత్త సుధారాణి, సీడీపీఓలు, నోడల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఖాతాల్లో డబ్బులేకున్నా సరుకులివ్వండి

- ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

అనంతపురం క్రైం: పోలీసు సిబ్బంది సంక్షేమానికి తొలి ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జరిగిన పోలీస్ వెల్ఫేర్ కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పోలీసులు, వారి కుటుంబాల కోసం ప్రస్తుతం ఎలాంటి సంక్షేమ చర్యలు అమలవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. వీటిని కొనసాగించడంతో పాటు మరిన్ని కొత్త కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. ప్రధానంగా పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై దృష్టిపెట్టాలన్నారు. సబ్సిడీ ధరలతో సరుకులు అందజేసే పోలీస్ క్యాంటిన్‌లో హోంగార్డుల మొదలు అధికారుల వరకూ వారి ఖాతాల్లో డబ్బులు లేకపోయినా రూ. 5 వేల నుంచి రూ.10వేల వరకూ సరుకులు ఇచ్చి తర్వాత వేతనంలో కట్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లలో మరుగుదొడ్లు, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అదనపు ఎస్పీలు విజయభాస్కర్ రెడ్డి, హనుమంతు, ఏఆర్ డీఎస్పీ మునిరాజ్, ఆర్ఐ రాముడు, ఆర్ఎస్ఐ రమేష్ నాయక్, ఏఓ శంకర్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు త్రిలోక్, సుధాకర్‌రెడ్డి, తేజ్‌పాల్, హరినాథ్, సరోజ తదితరులు పాల్గొన్నారు.

5, 6 తేదీల్లో జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

అనంతపురం సిటీ: ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు వచ్చే నెల 5, 6 తేదీల్లో నిర్వహించనున్నారు. 5న స్థాయీ సంఘం-1, 3, 7 సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. 6న స్థాయీ సంఘం-2, 4, 5, 6 (గ్రామీణాభివృద్ధి/ విద్య, వైద్యం/ స్త్రీ, శిశు సంక్షేమం/ సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశాలు డిప్యూటీ సీఈఓ లలితాబాయి ఆధ్వర్యంలో ఆయా స్థాయీ సంఘం అధ్యక్షుల అధ్యక్షతన నిర్వహించనున్నారు. గత సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన అంశాలు, వాటిపై తీసుకున్న చర్యల గురించి అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశాలకు హాజరు కావాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

ట్రాక్టర్ నగర్ డైరెక్టర్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న డైరెక్టర్ బాలాజీ మురారి

గార్లదిన్నె: న్యూ ఇన్నోవేషన్ ఇన్ అగ్రికల్చర్ మెకనైజేషన్ విభాగం కింద గార్లదిన్నెలోని ట్రాక్టర్ నగర్ డైరెక్టర్ డాక్టర్ బాలాజీ మురారి నాందేడేకు 'న్యూ ఇన్నోవేటర్ ఇన్ అగ్రికల్చరల్ మెకనైజేషన్' అవార్డు దక్కింది. మంగళవారం మధ్యప్రదేశ్‌లోని భోపాల్ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ వ్యవసాయ యంత్రముల తయారీదారుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమ్మేళనంలో ఈ అవార్డును ఆయన అందుకున్నారు. రాజ్‌కోట్‌లోని దర్ది ఆగ్రో ఇంజినీరింగ్ కంపెనీ ఆధ్వర్యంలో రూపొందించిన గాలితో నడిచే డ్రమ్ రకం నాటే యంత్రాన్ని అభివృద్ధి చేసినందుకు ఆయనకు అవార్డు దక్కినట్లు తెలిసింది.

క్లుప్తంగా

గణితంలో నిష్ణాతులను చేయండి



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి వి.నాగరాజు

రాప్తాడు: గణితంలో విద్యార్థులను నిష్ణాతులను చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి వి.నాగరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి డీఈఓ హాజరై, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. నిత్య జీవితంలో అన్ని సబ్జెక్టులతో పాటు గణితం చాలా ప్రాముఖ్యత కలిగి ఉందన్నారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నరసింహులు, సమగ్ర శిక్ష అసిస్టెంట్ సీఎంఓ గోపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అద్దె షాపులకు నేడు బహిరంగ వేలం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని టవర్ క్లాక్ న్యూ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 36, 42, 51 షాపులను లీజు ప్రాతిపదికన అద్దెకు ఇచ్చేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ భాగ్యలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు వేలం ప్రారంభమవుతుందన్నారు.

ప్రశాంత జీవనం సాగించాలి

ఆత్మకూరు: గ్రామంలో ప్రజలు ప్రశాంత జీవనం సాగించాలని ఎస్ఐ జనార్దన్ తెలిపారు. మండలంలోని పంపనూరు తండాలో మంళవారం ఎస్ఐ జనార్దన్, పోలీసు సిబ్బంది గ్రామసభ ఏర్పాటు చేశారు. ఎస్ఐ గ్రామస్తులకు పలు సూచనలను తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామంలో ప్రశాంతమైన వాతావరణంలో జీవించాలని, ఎలాంటి సమస్యలు, గొడవల జోలికి పోరాదన్నారు. ఏదైనా ప్రమాదం, గొడవలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. గ్రామాల్లో నాటు సారా తయారు చేయడం నేరమని, ఎవరైనా తయారు చేస్తే 100 కు ఫోన్ చేయాలని తెలిపారు.


రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు సనప విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

ఆత్మకూరు: జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్‌కళాశాలలో ఈనెల 25న జరిగిన జిల్లా స్థాయి హాకీ పోటీల్లో సనప జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ నాగరాజు తెలిపారు. అండర్-14 లో భాగంగా చంద్రగిరిలో త్వరలో జరగబోవు రాష్ట్ర స్థాయి హాకీ క్రీడలకు ప్రతాప్, శైలజ, షరిమ్మల, స్టాండ్ బాయ్‌గా మనమ్మ ఎంపికయినట్లు తెలిపారు.త్వరలో అనకాపల్లిలో జరగబోవు అండర్ - 17 రాష్ట్ర స్థాయి హాకీ క్రీడలకు హర్ష, రజిత, సంధ్య, స్టాండ్ బాయ్‌గా శిరీష, నంద కిషోర్, ఎంపికైనట్లు తెలిపారు. వీరిని ఇన్‌చార్జ్ హెచ్ఎం అనురాధ, లలితా, పీడీ నాగరాజు, ఉపాధ్యాయులు చంద్రకళ, మురళి, మధన్‌మోహన్, రాజేంద్ర , గ్రామస్తులు నరసింహులు, భాస్కర్‌రెడ్డి తదితరులు అభినందించారు.


పెద్దమ్మ తల్లికి బోనాలు



బోనాలు ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్తులు

ఆత్మకూరు: ఆత్మకూరు పొలిమేర పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ నెలరోజుల క్రితం మూడు రోజుల పాటు నిర్వహించారు. ఇందులో భాగంగా నెల పూజా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అమ్మవారికి గ్రామస్తులు పెద్ద ఎత్తున బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి సమర్పించారు.

హాస్టళ్లను తనిఖీ చేసిన జడ్జి



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి దీన

అనంతపురం: స్థానిక ఆదిమూర్తి నగర్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్, బీసీ హాస్టల్, ఎస్సీ హాస్టళ్లను అనంతపురం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి దీన మంగళవారం సందర్శించారు. ఆహార నాణ్యత, పరిశుభ్రతపై ఆరా తీశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

రెవెన్యూ అలసత్వం

- తాత్కాలికంగా ఆగిన సోములదొడ్డి లిక్కర్ గోడౌన్ నిర్మాణ పనులు
- 33 ఏళ్ల తర్వాత భూమిపై కోర్టుకు వెళ్లిన మహిళ
- ప్రభుత్వానికి పేరొస్తుందన్న అక్కసుతో టీడీపీ నేత కుట్ర
- కౌంటర్ దాఖలు చేయడంలో రెవెన్యూ అధికారుల అలసత్వం
- అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్‌కు లేఖ రాసిన ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రజత్‌భార్గవ్



నిర్మాణంలో ఉన్న లిక్కర్ గోడౌన్

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి వద్ద రూ.11 కోట్లతో అత్యాధునికంగా నిర్మిస్తున్న లిక్కర్ గోడౌన్ (బాట్లింగ్ యూనిట్) పనులు కోర్టు ఆర్డరుతో తాత్కాలింగా నిలిచిపోయాయి. కౌంటర్ దాఖలు చేయడంలో రెవెన్యూ అధికారులు అలసత్వం ప్రదర్శించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం కారణంగానే ఈ దుస్థితి నెలకొందంటూ స్వయంగా ప్రభుత్వ ప్రత్యేక చీఫ్ కార్యదర్శి రజత్‌భార్గవ్ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాయడం దుమారం రేపుతోంది.

పట్టించుకోని టీడీపీ ప్రభుత్వం..

సోములదొడ్డి వద్ద ఉన్న లిక్కర్ గోడౌన్‌లో 2016లో విద్యుత్ ప్రమాదం చోటు చేసుకోవడంతో పూర్తిగా కాలిపోయింది. అప్పటి నుంచి అద్దె భవనాల్లో గోడౌన్‌ను నిర్వహిస్తూ వస్తున్నారు. లిక్కర్‌గోడౌన్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.11 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్రంలోనే మోడల్ యూనిట్‌గా నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటిదాకా దాదాపు రూ. 5 కోట్ల దాకా ఖర్చు చేశారు. 50 శాతం పనులు పూర్తయ్యాయి.

37 ఏళ్ల కిందట లిక్కర్ గోడౌన్‌కు కేటాయింపు..

సోములదొడ్డి పొలం 112–1ఏ సర్వే నంబరులో 4.60 ఎకరాల్లో లిక్కర్ గోడౌన్ ఉంది. ఇందులోని 2.40 ఎకరాల భూమికి 1984 మార్చి 13న పి.లక్ష్మీనారాయణ అనే వ్యక్తి మాజీ సైనికుడి పేరుతో రెవెన్యూ అధికారులు పట్టా ఇచ్చారు. అదే ఏడాది జూలై 10న సదరు భూమి తనకు వద్దని లక్ష్మీనారాయణ రాతపూర్వకంగా రాయించి ఇచ్చాడు. ఇదే సమయంలో ప్రభుత్వం లిక్కర్ గోడౌన్ కోసం భూమి ఇవ్వాలని తహసీల్దార్‌కు లేఖ రాయడంతో ఈ భూమిని కేటాయించారు. ఇందులో 1.70 ఎకరాల భూమిని గోడౌన్‌కు తీసుకున్నారు. పక్కనే మరింత ప్రభుత్వ భూమి ఉండడంతో కలుపుకుని మొత్తం 4.60 ఎకరాల్లో గోడౌన్ ఏర్పాటు చేశారు.

తహసీల్దార్ ఏమంటున్నారంటే...

లిక్కర్ గోడౌన్ కంటెమ్ట్ కేసులో జూలై 23న కార్యాలయానికి నోటీసు అందింది. 24న వాస్తవ నివేదిక ఇచ్చాం. 25న వకాల్తా ఫైల్ చేశాం. ఆగస్టు 8న కౌంటరు దాఖలు చేశాం. లక్ష్మీనారాయణ అనే వ్యక్తికి మాజీ సైనికుడి పేరుతో 1984న పట్టా ఇచ్చారు. అయితే తనకు భూమి అవసరం లేదని స్వయంగా ఆయన రాసివ్వడంతో వెనక్కు తీసుకున్నారు. అప్పట్లోనే ఈ భూమిని లిక్కర్ గోడౌన్‌కు అప్పగించారు.

కోర్టుకు వెళ్లిన లక్ష్మీనారాయణ కోడలు ..

లిక్కర్ గోడౌన్ నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందనే అక్కసుతో సోములదొడ్డి పంచాయతీలో ఉన్న టీడీపీ చోటా నాయకుడు భూమికి పరిహారం ఇవ్వకుండా వెనక్కు తీసుకున్నారంటూ లక్ష్మీనారాయణ కోడలితో హై కోర్టులో పిల్ వేయించాడు. దీంతో కోర్టు స్టే ఇచ్చింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయడంలో రెవెన్యూ అధికారులు అలసత్వం ప్రదర్శించారు. కేసు కంటెమ్ట్ కావడంతో నిర్మాణ పనులు తాత్కాలికంగా నిలుపుదల చేయాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై రాష్ట్ర స్థాయి అధికారులు ఇక్కడి రెవెన్యూ అధికారులను చురక అంటించడం చర్చనీయాంశమైంది. కోర్టుకు వెళ్లిన వైనంపై ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు రాష్ట్ర స్థాయి అధికారులతో చర్చించారు.

దాసరి ఆదినారాయణకు 'ప్రజా కళారత్న' అవార్డు



దాసరి ఆదినారాయణ

అనంతపురం కల్చరల్: అనంత ప్రజా కళాకారుడిగా, విప్లవ గాయకుడు దాసరి ఆదినారాయణకు పద్మభూషణ్ గుర్రంజాషువా స్మారక కళాపరిషత్తు వారు ప్రజా కళారత్న అవార్డుకు ఎంపిక చేశారు. గత 38 ఏళ్లగా రాష్ట్రంలో ప్రసిద్ధులైన వారికి అందించే పురస్కారాన్ని ఈ ఏడాది నగరానికి చెందిన సీనియర్ కళాకారుడు ఆదినారాయణకు అందజేస్తున్నారు. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ పెద్దిటి యోహాను మంగళవారం వివరాలు అందించారు. మహాకవి జాషువా 125వ జయంత్యుత్సవాల సందర్భంగా వచ్చేనెల 1న విజయవాడలోని ఠాగూరు గ్రంథాలయంలో జరిగే ప్రదానోత్సవంలో ఆయన ప్రజా కళారత్న పురస్కారంతో పాటూ ఘనంగా సత్కారం అందుకోనున్నారు.

సివిల్ సర్వీసెస్‌పై దృష్టి సారించాలి



సివిల్ సర్వీసెస్ పుస్తకాలను విద్యార్థులకు అందజేస్తున్న వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: యువత సివిల్ సర్వీసెస్ ఉద్యోగమే లక్ష్యంగా దృష్టి సారించాలని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దన అన్నారు. మంగళవారంజేఎన్‌టీయూఏ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల మెకానిక్ సెమినార్ హాలులో 'సివిల్ సర్వీస్ ఫౌండేషన్ ప్రోగ్రాం ' అనే అంశంపై ప్లంజరీ ఫౌండేషన్ అధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్వీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. అనంతరం అద్దంకి శ్రీధర్ బాబు, రచించిన 'మీరూ 'శ్రీ' లు సక్సెస్ సాధనకు 30 సూత్రాలు' అనే పుస్తకాలను ఈ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో అనంతరం రెక్టార్ ప్రొఫెసర్ యం.విజయ కుమార్, అల్యూమిని డైరెక్టర్ ప్రొఫెసర్ పి.సుజాత, ప్రొఫెసర్ వి. శంకర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇ.అరుణ కాంతి, ప్రొఫెసర్ ఏపీ శివ కుమార్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ కె. కళ్యాణి రాధ, పూర్వ విద్యార్థి డి.నాగేశ్వర రావు అమెరికా (1969 పూర్వ విద్యార్థి), విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలి

అనంతపురం: ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానానికనుగుణంగా నూతన ఇంజినీరింగ్ సిలబస్‌ను రూపకల్పన చేశామని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన అన్నారు. మంగళవారం 'ఓరియంటేషన్ ప్రోగ్రాం ఫర్ బీటెక్ ఫస్టియర్ (2023–24 అడ్మిటెడ్ బ్యాచ్)' అనే అంశంపై ఇంజినీరింగ్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ఎవాల్యుయేషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఈ కేశవ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణకాంతి, పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం. రామశేఖర్ రెడ్డి, డాక్టర్ డి. విష్ణు వర్ధన్ పాల్గొన్నారు.

రైతులను మోసగించడంలో బాబు దిట్ట

- వైఎస్ వచ్చిన తర్వాత ఉచిత కరెంటు చూశాం
- రైతులకు అండగా నిలుస్తోన్న జగనన్న ప్రభుత్వం
- బాబు జైలుకెళ్లిన తర్వాత వర్షాలు కురుస్తున్నాయి
- అసెంబ్లీలో ప్రజలకు విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: రైతులను మోసగించడానికి చంద్రబాబు ఎప్పుడూ వెనుకాడలేదని, ఆయన హయాంలో ఉచిత కరెంటు కోసం రైతులు ఉద్యమాలు చేస్తే ఉద్యమకారులపై తుపాకీ గుళ్ల వర్షం కురిపించి ఏడుగురిని హత్య చేయించారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీలో ఆయన రాష్ట్రంలో వ్యవసాయ పరిస్థితులపై మాట్లాడారు. వైఎస్ అధికారంలోకొచ్చిన తర్వాత రాష్ట్రంలో ఉచిత కరెంటు అనేది చూశామన్నారు. అంతకుముందు కరెంటు బిల్లులు చెల్లించలేని పరిస్థితుల్లో రైతులు ఉంటే.. స్టార్టర్ పెట్టెలు ఎత్తుకెళ్లి పోలీస్ స్టేషన్లలో పెట్టి, బకాయిలు వసూలు చేశారన్నారు. ఆతర్వాత వైఎస్ తీసుకున్న నిర్ణయంతో ఈరోజు రాష్ట్రంలో 20 లక్షల మంది రైతులు ఉచిత కరెంటు సదుపాయం పొందుతున్నారన్నారు. అనంతపురం జిల్లాలో కరువుకు భయపడి సేద్యం చేయలేని పరిస్థితుల్లో దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతులకు ధైర్యం చెప్పారన్నారు. పంటల బీమా తీసుకొచ్చి ఆపద్బాంధవుడు అయ్యారన్నారు. రాష్ట్రంలో రైతుల రుణాలు మాఫీ చేయడమే కాకుండా దేశవ్యాప్తంగా రైతుల రుణాలు మాఫీ కావడానికి కారుకులయ్యారన్నారు.

వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు ..

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉచిత కరెంటు ఇస్తామని చెబితే, ఆ తీగలు దుస్తులు ఆరేసుకోవడానికి పనికొస్తాయని చంద్రబాబు హేళన చేశారని ప్రకాష్‌రెడ్డి గుర్తు చేశారు. వ్యవసాయం దండగ అని కూడా మాట్లాడారన్నారు. అలాంటి వ్యక్తి 2014లో అధికారంలోకొచ్చేందుకు సంపూర్ణ రుణమాఫీ అని హామీ ఇచ్చారన్నారు. రైతులు బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారం విడిపిస్తామని హామీ ఇచ్చారన్నారు. తీరా అధికారంలోకొచ్చిన తర్వాత ఆ హామీలన్నీ బుట్టదాఖలయ్యిందన్నారు. రూ. 24 వేల కోట్ల రైతు రుణాలను మాఫీ చేస్తానని చెప్పిన చంద్రబాబు కేవలం రూ. 14 వేల కోట్లు మాత్రమే చెల్లించారన్నారు. 2018–19 సంవత్సరం ఇన్‌పుట్ సబ్సిడీ బకాయి, బీమా బకాయి ఎగరగొట్టారన్నారు. 2013–14 సంవత్సరానికి సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించలేదన్నారు.

చంద్రబాబు ఉన్నంత కాలమూ కరువే ..

చంద్రబాబు అధికారంలో ఉన్నంత కాలమూ కరువేనని, ఏటా 200 నుంచి 300 మండలాలు కరువు మండలాలుగా ప్రకటించేవారని ప్రకాష్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు అధికారంలో ఉంటే వర్షాలు కురవవని ప్రజలు నమ్ముతున్నారన్నారు. ఇటీవల కాలంలోనూ చంద్రబాబు అనంత జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంలో 'మీరు మా జిల్లాకు రావొద్దు...వస్తే వర్షాలు రావు' అని ప్రెస్‌మీట్లు పెట్టి మరీ విజ్ఞప్తి చేశామన్నారు. ఆయన కుమారుడు లోకేష్ యువగళం పాదయాత్ర చేస్తుంటే మేఘాలు పారిపోయాయన్నారు. ఈమధ్య చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైలుకు వెళ్లి కూర్చున్న తర్వాత వర్షాలు పడుతున్నాయని, పదును వర్షాలు కురుస్తున్నాయన్నారు.

రైతు ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించండి

జగనన్న వచ్చిన తర్వాత నాలుగేళ్లలో 31 వేల కోట్లు రైతు భరోసా కోసం ఖర్చు చేశామని ప్రకాష్‌రెడ్డి గుర్తు చేశారు. ఉచిత విద్యుత్‌కు సంబంధించి గత ప్రభుత్వ చెల్లించని రూ. 8,860 కోట్ల బకాయిలతో కలుపుకొని రూ. 41,256 కోట్లు చెల్లించారన్నారు. గత ప్రభుత్వంలో చెల్లించాల్సిన బీమాతో కలిపి రూ. 7,800 కోట్లు చెల్లించామన్నారు. పెట్టుబడి రాయితీ, సున్నా వడ్డీ, ఆక్వా రైతులకు రాయితీ, యాంత్రీకరణకు రూ. లక్షా 8 వేలా 60 కోట్లు ఖర్చు చేశామన్నారు. ధాన్యం, ఇతర పంటల ఉత్పత్తుల సేకరణకు రూ. 60 వేల కోట్లకు పైగా ఖర్చు చేశామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన రైతు భరోసా కేంద్రాల్లోనే ఈక్రాప్ బుకింగ్ జరుగుతోందన్నారు. ఇలాంటి రైతు సంక్షేమ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు.

నాణ్యమైనది భారతి సిమెంట్



డీలర్లకు బహుమతులు అందజేస్తున్న భారతీ సిమెంట్ కంపెనీ ప్రతినిధులు

అనంతపురం రూరల్: అత్యుత్తమ కట్టడాలకు నాణ్యమైనది భారతి సిమెంట్ అని, ఇంజనీర్లు భారతీ సిమెంట్‌నే మెదటగా ఎంపిక చేస్తున్నారని భారతీ సిమెంట్ కంపెనీ సౌత్ ఇండియా మార్కెటింగ్ హెడ్ మల్లారెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో భారతి సిమెంట్ డీలర్లు, సబ్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతి సిమెంట్ కంపెనీ సౌత్ ఇండియా సేల్స్ హెడ్ మల్లారెడ్డి మాట్లాడుతూ అత్యుత్తమ కట్టడాలకు నాణ్యమైన సిమెంట్ భారతి సిమెంట్ అన్నారు. నిర్మాణ రంగంలో తిరుగులేనిది, ఎక్కువశాతం మంది ప్రజలు భారతీసిమెంట్‌ను వాడుతున్నారన్నారు. సామాన్యులకు సైతం అందుబాటులో సిమెంట్ ధరలు ఉన్నాయన్నారు. అనంతరం సిమెంట్ అధిక శాతం సేల్స్ చేసిన డీలర్లను కంపెనీ ప్రతినిధులు ఘనంగా సన్మానించి, బహుమతులు అందించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు మల్లికార్జునరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, సుబ్బరాయుడు, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటెక్స్ పోటీల్లో ప్రతిభ



సత్తా చాటిన అనంతపురం క్రీడాకారులు

అనంతపురం: ఈనెల 21 నుంచి 23 వరకూ గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీలో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో అనంతపురం జిల్లాకు చెందిన క్రీడాకారులు 26 పతకాలు సాధించారని అథ్లెటిక్స్ అడహాక్ కమిటీ చైర్మన్ ఇస్మాయిల్, కన్వీనర్ రవికుమార్ తెలిపారు.

పతకాలు పొందిన క్రీడాకారుల వివరాలు: అండర్–23 విభాగంలో సి.ప్రత్యూష 100, 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, జావలిన్ త్రోలో బి.భరత్ రజతం సాధించారు.

అండర్–14 విభాగంలో : బాలుర విభాగంలో టి.రాజేష్ 600 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, లాంగ్‌జంప్‌లో బాలికల విభాగంలో తేజశ్విణి రజతం సాధించారు.

అండర్–16 విభాగంలో: బాలికల విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో జాహ్నవి బంగారు పతకం, 300 మీటర్ల విభాగంలో రజత పకతం సాధించింది. బాలుర విభాగంలో హైజంప్‌లో మహ్మద్ రజత పతకం సాధించారు

అండర్–18 విభాగంలో: బాలికల విభాగంలో 1500 మీటర్ల పరుగుపందెంలో శ్రీనిత్య బంగారు పతకం, 800 మీటర్ల విభాగంలో రజతం, 100 మీటర్ల విభాగంలో లావణ్య బంగారు పతకం, 200 మీటర్ల విభాగంలో రజతం , 1500 మీటర్ల పరుగుపందెంలో భవ్యశ్రీ రజతం, ట్రిప్ జంప్‌లో అక్షయ రజతం, 3కేఎంలో గౌతమి రజత పతకం, డిస్కస్‌త్రోలో పవిత్ర కాంస్యం సాధించారు.

అండర్–20 విభాగంలో: డిస్కస్‌త్రోలో నవ్యశ్రీ కాంస్యం, 200 మీటర్ల రిజ్వాన కాంస్యం, షాట్‌పుట్‌లో మాలశ్రీ కాంస్యం, 800 మీటర్ల లహరీ కాంస్యం, 1500 మీటర్ల దాక్షాయణి కాంస్యం సాధించారు. 4 X100 విభాగంలో బాలురు కాంస్యం, లాంగ్‌జంప్‌లో రవీంద్ర సిల్వర్, రెస్‌నాక్‌లో శ్రీనివాసులు కాంస్యం పతకాలు సాధించారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయండి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ఉమా మహేశ్వరమ్మ

రాప్తాడు: అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి, పక్కా గృహాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మండల ప్రత్యేకాధికారి ఉమా మహేశ్వరమ్మ పేర్కొన్నారు. శనివారం ఆమె స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ, రెవెన్యూ ఉద్యోగులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు పక్కా గృహం నిర్మించాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని అన్నారు. నియోజకవర్గంలో ఆరు మండలాల్లో దాదాపుగా 30 వేల మంది పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేసి, ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. మండల వ్యాప్తంగా ఇంటి స్థలం ఉన్న వారికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇస్తే వారు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభిస్తారని, వారికి వెంటనే పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని ఆదేశించారు. ఇంకా అర్హులు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. బిల్లులు కూడా సకాలంలో పడుతున్నాయని చెప్పారు. నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, తహసీల్దార్ లక్ష్మీ నరసింహులు, హౌసింగ్ ఏఈ పవన్, ఈఓఆర్డీ నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జీఎంసీలో నా దేశం..నా భూమి'

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాలలోని స్మృతివనంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ' నా దేశం– నా భూమి' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి, తదితరులు మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యాంప్రసాద్, ఏడీ నాగరత్నమ్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కుష్టును ప్రారంభ దశలోనే గుర్తించాలి

అనంతపురం మెడికల్: కుష్టువ్యాధిని ప్రారంభదశలోనే గుర్తిస్తే అంగవైకల్యం కలగదని కుష్టు వ్యాధి విభాగం జిల్లా అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ అన్నారు. మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఆ విభాగం సిబ్బందితో ఆమె సమీక్ష నిర్వహించారు. కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించాలన్నారు. కుష్టు వ్యాధికి భయపడాల్సిన పనిలేదని, ఆరు నెలల నుంచి ఏడాదికాలం మందులతో ఏ దశలో ఉన్నా నయం చేయొచ్చన్నారు. సమావేశంలో డాక్టర్ అన్వర్ బాషా, పారా మెడికల్ అధికారి నాగన్న, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సత్యనారాయణ, డిప్యూటీ పారామెడికల్ అధికారి సూర్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన భాగవత సప్తాహం

అనంతపురం కల్చరల్: ఏడు రోజులుగా ఆధ్యాత్మిక భావాన్ని పెంచిన భాగవత సప్తాహం మంగళవారం రాత్రి ముగిసింది. సాయిట్రస్టు ఆధ్వర్యంలో అశోక్‌నగర్‌లోని శ్రీరమా సమేత సత్యనారాయణస్వామి ఆలయంలో ముగింపు వేడుకలు జరిగాయి. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త అన్నాజీ అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు విజయ్‌కుమార్, రాఘవసాయి, నారాయణసాయి, భూపాలం కిశోర్ పాల్గొన్నారు.

మెడికల్ పీజీ విద్యార్థినికి సన్మానం



పీజీ విద్యార్థి డాక్టర్ అర్చనాదేవిని సన్మానిస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాలలోని శరీరధర్మ శాస్త్రం (ఫిజియాలజీ) విభాగంలో పీజీ రెండో సంవత్సరం చదువుతున్న డాక్టర్ అర్చనాదేవిని వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి మంగళవారం సన్మానించారు. ఇటీవల గోవాలో నేషనల్ ఫిజియాలజీ కాన్ఫరెన్స్ పోస్టర్ ప్రజెంటేషన్ జరిగింది. వివిధ రాష్ట్రాల నుంచి పీజీ విద్యార్థులు పోస్టర్ ప్రజెంటేషన్‌లో పాల్గొన్నారు. అందులో డాక్టర్ అర్చన ప్రథమ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్యాంప్రసాద్, ఫిజియాలజీ హెచ్ఓడీ డాక్టర్ సరళ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'కాగడాల ప్రదర్శనకు అనుమతి లేదు'

అనంతపురం క్రైం: జిల్లా కేంద్రంలో బుధవారం టీడీపీ చేపట్టనున్న కాగడాల ప్రదర్శనకు అనుమతి లేదని, ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అనంతపురం డీఎస్పీ జి.ప్రసాదరెడ్డి హెచ్చరించారు. ప్రధాన రహదారులపై ప్రదర్శనగా వెళ్లడం వల్ల ప్రజలు అసౌకర్యానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. విద్యార్థులను, ఉద్యోగులు, వృద్ధులు, వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చే వారిని, అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు, తదితర అత్యవసర సేవలను దృష్టిలో ఉంచుకొని కాగడాల ప్రదర్శనకు అనుమతి లేదన్నారు. 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉండటం వల్ల పోలీసుల అనుమతి లేనిదే ర్యాలీలు, ధర్నాలు చేయరాదన్నారు.

సంక్షిప్త సమాచారం

పేకాట కేంద్రంపై దాడి

అనంతపురం క్రైం: స్థానిక నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని మారుతీనగర్‌లో ఓ ఇంటిపై పోలీసులు దాడి చేసి, 9 మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.3,69,300 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

అండర్–19 క్రీడా పోటీలకు ఎంపిక

అనంతపురం: నగరంలోని ఇండోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్–19 కబడ్డీ, టేబుల్‌టెన్నీస్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, తైక్వాండో, షటిల్, యోగా ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు అంతర జిల్లా పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ జి.లక్ష్మీ నారాయణ తెలిపారు.

యువతి అదృశ్యం

అనంతపురం క్రైం: స్థానిక త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి కళాశాలకు వెళ్లాల్సిన విద్యార్థిని గీతిక కనిపించలేదని బాధితురాలి తండ్రి రామకృష్ణ సీఐ ధరణీకిశోర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. అన్నమయ్య జిల్లా బి. కొత్తకోటకు చెందిన గీతిక, కాంచనా అక్కచెల్లెళ్లు. వీరివురు స్వగ్రామానికి వెళ్లి మంగళవారం అనంతపురం వచ్చారు. కాంచనా జేఎన్‌టీయూకు కళాశాలకు వెళ్లగా గీతిక ఆలుమూరు రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయ అగ్రికల్చర్ కళాశాలకు వెళ్లాలని ఆగింది. కానీ కళాశాలకు చేరుకోలేదు. బాధితురాలి తండ్రి త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించారు.

'సర్పంచ్‌పై దాడికి చింతిస్తున్నా'

రాప్తాడురూరల్: 'అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి సర్పంచ్ బండ ఆంజియాదవ్‌పై దాడికి చింతిస్తున్నానని, వినాయక నిమజ్జనం రోజున ఏదో పొరపాటుగా ఈ ఘటన జరిగింది. నన్ను క్షమించాలి' అని సిండికేట్‌నగర్‌కు చెందిన దేవరకొండ మహేష్ అన్నారు. మంగళవారం తల్లిదండ్రులతో కలిసి మహేష్ మీడియాతో మాట్లాడాడు. చిన్నప్పటి నుంచి అంజియాదవ్‌తో కలిసిమెలిసి ఉన్నామని తెలిపాడు. ఆయనతో తనకు ఎలాంటి విభేదాలు లేవన్నారు. వినాయక నిమజ్జనం రోజున అనుకోకుంటా ఈ ఘటన జరిగిందన్నారు. భవిష్యత్తులోనూ ఎలాంటి గొడవలు చేసుకోమని అందరూ కలిసిమెలిసి ఉంటామన్నారు. మహేష్ తల్లిదండ్రులు మాట్లాడుతూ ఆరోజు ఘటనలో తమ కుమారుడిని క్షమించాలని కోరారు. సర్పంచ్ అంజియాదవ్ మాట్లాడుతూ రాచానపల్లి పంచాయతీ ప్రశాంతతకు మారుపేరు అన్నారు. తనకు క్షమాపణలు అవసరం లేదని భవిష్యత్తులోనూ అందరూ కలిసిమెలిసి ఉండాలని కోరుకుంటున్నానన్నారు. తనకు చేతనైన మేరకు సేవలందిస్తాను తప్ప గొడలకు చాలా దూరంగా ఉంటానని స్పష్టం చేశారు.

పిల్లిగుండ్ల కాలనీలో ఘర్షణపై ఫిర్యాదు

రాప్తాడురూరల్: నిశ్చితార్థం అయిన యువతి మరో యువకుడితో వెళ్లిపోవడంతో వధూవరుల బంధువులు పరస్పరం దాడి చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు..అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికాలనీ పంచాయతీ పిల్లిగుండ్లకాలనీకి చెందిన యువతికి కళ్యాణదుర్గం మండలం పాలబావి గ్రామానికి చెందిన గణేష్ అనే యువకుడితో ఇటీవల నిశ్చితార్థం అయ్యింది. వరుడు గణేష్ నడివడిక సరిగా లేదని తెలుసుకున్న యువతి మరో యువకుడితో వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న గణేష్, అతడి తండ్రి చంద్ర, ఇతర బంధువులు మంగళవారం పిల్లిగుండ్లకాలనీకి వచ్చారు. పెద్ద మనుషులుగా ఉన్న అమ్మాయి మేనమామలైన హరీష్, రామాంజనేయులును కలిసి వాదించారు. ఎంగేజ్‌మెంట్ అయిన అమ్మాయిని మరో యువకుడితో ఎలా పంపారంటూ గొడవపడ్డారు. మాటామాటా పెరగడంతో గణేష్ బంధువులు అమ్మాయి మేనమామలైన హరీష్, రామాంజనేయులుపై దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కాంట్రాక్టర్ పీఎఫ్ చెల్లించలేదని ఫిర్యాదు



కలెక్టర్ గౌతమికి వినతిపత్రం అంజేస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతపురం అర్బన్: సత్యసాయి నీటి పథకంలో పని చేస్తున్న కార్మికులకు పీఎఫ్ సొమ్మును సంబంధిత కాంట్రాక్టర్ చెల్లించలేదని కలెక్టర్ గౌతమికి సీఐటీయూ నాయకులు ఫిర్యాదు చేశారు. మంగళవారం కలెక్టర్‌ను కలెక్టరేట్‌లో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, తదితరులు కలిసి వినతిపత్రం అందజేసి సమస్య వివరించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో శ్రీ సత్యసాయి నీటి పథకంలో దాదాపు 572 మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. నాయకులు ఈశ్వరయ్య, రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఏడీసీసీబీ చైర్‌పర్సన్



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న లిఖిత, పామిడి వీరా

అనంతపురం క్రైం: జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌ను జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, మాజీ చైర్మన్ వీరా మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి, సన్మానించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నాయకులు, విద్యార్థులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్ మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల్లో నాడు– నేడు పనులు చేపట్టి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని, మధ్యాహ్న భోజనం అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మఒడి చెల్లించాలన్నారు.